తెలుగు దినపత్రిక

# డైలీ రిపోర్ట్

DAILY REPORT




సంపుటి: 1 | సంచిక: 73 | పేజీలు: 4 | ఎడిటర్ : బక్క రవీందర్ | ప్రచురణ: హైదరాబాద్ | శుక్రవారం 18 -10-2024 | వెల: 5/రూ -

# సుందరీకరణ కాదు.. పునరుజ్జీవం!


## కొందరు మూసీ సుందరీకరణ అనే డైలాగ్‌ను ప్రచారంలోకి తెచ్చారు

- అధికారం కోల్పోయి నిస్పృహతో నది పునరుజ్జీవానికి అడ్డుపడుతున్నారు
- మీడియా భేటీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఫైర్
- మేం అందాల కోసం పనిచేయడం లేదు..అందాల భామలతో కలిసి పనిచేయడం లేదు
- మంత్రులు, ప్రజా ప్రతినిధుల ముసుగులో కొందరు రాష్ట్రాన్ని పట్టి పీడించారు
- బందిపోటు దొంగల్లా పట్టపగలు దోపిడీ చేసి స్వేచ్ఛగా తిరుగుతున్నారు
- కేటీఆర్, హరీశ్, ఈటల మూసీ తీరంలో మూడు నెలలుంటే ప్రాజెక్టును ఆపేస్తానన్న సీఎం
- రూ.141 కోట్లతో కన్సార్టియంకు ప్రాజెక్టు డీపీఆర్ తయారీ బాధ్యతలు అప్పగించినట్లు వెల్లడి

హైదరాబాద్:'అధికారం కోల్పోయి నిస్పృహ, అసహనంతో మూసీ నది పునరుజ్జీవానికి కొంతమంది అడ్డుపడుతున్నారు. మూసీ సుందరీకరణ అనే డైలాగ్‌ను ప్రచారంలోకి తెచ్చారు. మేము అందాల కోసం పని చేయడం లేదు. అందాల భామలతో కలిసి పనిచేయడం లేదు. అలాంటి కొంతమంది.. మంత్రులు, ప్రజాప్రతినిధుల ముసుగులో పదేళ్ల రాష్ట్రాన్ని పట్టిపీడించి బందిపోటు దొంగలకంటే దుర్మార్గంగా పట్టపగలు

2లో





## మూసీపై సీఎం తీరు అర్థరహితం: కేటీఆర్

బీఆర్ఎస్ ధ్వజం

మూసీపై నేడు కేటీఆర్ ప్రజెంటేషన్



## సుప్రీంకోర్టు తదుపరి సీజేఐగా జస్టిస్ సంజీవ్ ఖన్నా!

దిగిపోయే ముందు సుప్రీంకోర్టులోని సీనియర్ న్యాయమూర్తి

సిఫారసు చేసిన సుప్రీం చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్

2లో



## నటి తమన్నాను ప్రశ్నించిన ఈడీ

నటి తమన్నాను ప్రశ్నించిన ఈడీ

- గువాహటి ఈడీ కార్యాలయంలో వాంగ్మూలం నమోదు
- మహదేవ్ బెట్టింగ్ యాప్ స్కామ్ కేసులో సినీ తారలు
- బెట్టింగ్‌ల ద్వారా వచ్చిన డబ్బు హవాలా మార్గంలో విదేశాలకు..

# కలిసికట్టుగా వికసిత్ భారత్

- కెప్టెన్‌లా కృషి చేస్తున్న ప్రధాని మోదీ.. మనందరం అండగా నిలుద్దాం
- పేదరిక నిర్మూలనకు తొలి ప్రాధాన్యం.. కీలకంగా నదుల అనుసంధానం
- సాంకేతికతతో చౌకగా వైద్యం.. ఎన్డీయే సీఎంల భేటీలో బాబు ప్రసంగం




ఎన్డీయే సర్కారు అమలు చేస్తున్న మేక్ ఇన్ ఇండియా, డిజిటల్ ఇండియా, స్వచ్ఛ భారత్, స్కిల్ ఇండియా కార్యక్రమాలు దేశ సామాజిక, ఆర్థిక, రాజకీయ వికాసంతోపాటు... భారత శక్తిని చాటి చెబుతున్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. 'వికసిత్ భారత్'కు ప్రధాని మోదీని 'కెప్టెన్'గా అభివర్ణించారు.

అమరావతి: ఎన్డీయే సర్కారు అమలు చేస్తున్న మేక్ ఇన్ ఇండియా, డిజిటల్ ఇండియా, స్వచ్ఛ భారత్, స్కిల్ ఇండియా కార్యక్రమాలు దేశ సామాజిక, ఆర్థిక, రాజకీయ వికాసంతోపాటు... భారత శక్తిని చాటి చెబుతున్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. 'వికసిత్ భారత్'కు ప్రధాని మోదీని 'కెప్టెన్'గా అభివర్ణించారు. "మోదీ ఒక కెప్టెన్‌గా తన ఆలోచనలతో వికసిత్ భారత్ 2047 కోసం అడుగులు వేస్తున్నారు. ఆయనకు అండగా నిలుద్దాం. అంతా కలిసి భారతదేశాన్ని మరింత వికసిత్ భారత్‌గా మార్చుదాం" అని చంద్రబాబు పిలుపునిచ్చారు. గురువారం చండీగఢ్‌లో నిర్వహించిన

2లో



## నవంబర్ మొదటివారంలో దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభం

- జనవరి, ఏప్రిల్‌లో మెయిన్స్
- సిలబస్ కుదింపుపై తర్జనభర్జన
- గత ఏడాది తగ్గిన సిలబస్
- పరీక్ష కేంద్రాల పెంపు అంశంపై పరిశీలన

హైదరాబాద్: జేఈఈ%-%2025 నోటిఫికేషన్ ఈ నెలాఖరులో వెలువడనుంది. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఈ దిశగా తన ప్రయత్నాలను ముమ్మరం చేసింది. నవంబర్ మొదటి వారంలో ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభించే వీలుందని అధికార వర్గాల ద్వారా తెలిసింది. జనవరిలో మొదటి విడత జేఈఈ మెయిన్స్ నిర్వహిస్తారు. ఆ తర్వాత ఏప్రిల్ లేదా మే నెలలో రెండో విడత మెయిన్స్‌ను ఆన్‌లైన్ పద్ధతిలో చేపట్టనున్నారు. దేశంలోని ప్రతిష్ఠాత్మక ఐఐటీలు, ఎన్ఐటీలు, ట్రిపుల్ ఐటీలు, కేంద్ర ప్రభుత్వ నిధులతో నడిచే ఇంజనీరింగ్ సంస్థల్లో ప్రవేశానికి ఈ ఉమ్మడి ప్రవేశ పరీక్ష (జేఈఈ)ను



# ప్రియాంక ప్రత్యర్థి సత్యన్ మొకెరి

2లో



## బలంగా ఎదుగుదాం.. పార్టీని పటిష్టంగా నిర్మిద్దాం

- క్షేత్ర స్థాయి నుంచి పార్టీని మరింత పటిష్టంగా నిర్మిద్దాం
- 4 నెలల్లోనే ఈ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలం.. ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత
- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర స్థాయి వర్క్ షాప్‌లో వైఎస్ జగన్
- గ్రామ, బూత్ కమిటీలతో పాటు అనుబంధ విభాగాల ఏర్పాటు.. మహిళలకు ప్రాధాన్యత
- ప్రజల కోసం పార్టీ పిలుపునిస్తే ఉవ్వెత్తున స్పందించేలా బలోపేతం
- మన కార్యకర్తలు తలెత్తుకుని తిరిగేలా మనం ప్రజలకు మంచి చేశాం

# నటి తమన్నాను ప్రశ్నించిన ఈడీ

(మొదటి పేజీ తరువాయి)

గువాహటి, అక్టోబరు 17: మహదేవ్ బెట్టింగ్ యాప్ కుంభకోణం కేసులో నటి తమన్నా భాటియాను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్(ఈడీ) అధికారులు ప్రశ్నించారు. తల్లితో కలిసి గువాహటి ఈడీ కార్యాలయానికి చేరుకున్న తమన్నాను ఈడీ అధికారులు సుదీర్ఘంగా ప్రశ్నించారు. వాంగ్మూలం నమోదు చేసుకున్నారు.

**17 మంది బాలీవుడ్ ముఖ్యులపై నిఘా**

మహదేవ్ బెట్టింగ్ యాప్ ద్వారా వందల కోట్ల అవినీతి జరిగిందనే ఆరోపణలున్నాయి. ఈ యాప్ ద్వారా ఐపీఎల్, ఫుట్‌బాల్, బ్యాడ్మింటన్, టెన్నిస్ మ్యాచ్‌లకు సంబంధించి బెట్టింగ్, గ్యాంబ్లింగ్ నిర్వహించారు. సామాన్యులను ఆకర్షించేందుకు సినీతారలతో ప్రమోట్ చేయించారు. ఇందుకోసం నిర్వాహకులు భారీగా ఖర్చుపెట్టారు. నకిలీ పత్రాలతో వేల సిమ్‌లు, బ్యాంక్ ఖాతాలు తెరిచి బెట్టింగ్‌ల ద్వారా వచ్చిన డబ్బును హవాలా, క్రిప్టో మార్గాల్లో విదేశాలకు తరలించినట్లు అధికారులు గుర్తించారు. మొత్తం 17 మంది బాలీవుడ్ ప్రముఖులపై 2023 సెప్టెంబర్ నుంచి అధికారుల నిఘా కొనసాగుతోంది. ఈ కేసులో నటుడు సాహిల్ ఖాన్‌ను అరెస్ట్ చేసింది.

# కలిసికట్టుగా వికసిత్ భారత్

(మొదటి పేజీ తరువాయి)

ఎన్డీయే కూటమి ముఖ్యమంత్రుల సమావేశంలో ఆయన ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కూడా పాల్గొన్నారు. ఈభేటీలో ప్రధానంగా 'వికసిత్ భారత్'పై చర్చించారు. పేదరిక నిర్మూలన, ఉద్యోగాల కల్పన, తక్కువ వ్యయంతో విద్యుదుత్పత్తి, నదుల అనుసంధానం, నైపుణ్యం పెంపు తదితర అంశాలపై చంద్రబాబు తన ఆలోచనలను పంచుకున్నారు. "గతిశక్తి, డిజిటల్ ఇండియా, మేక్ ఇన్ ఇండియాలాంటి కార్యక్రమాల ద్వారా దేశం గణనీయమైన పురోగతి సాధించింది. ఆయుష్మాన్ భారత్ వంటి పథకాలు ప్రజలకు ఎంతో చేరువయ్యాయి. 'జామ్' (జన్‌ధన్, ఆధార్, మొబైల్)కు నైపుణ్యాన్ని (స్కిల్) కూడా జోడించి జామ్స్‌గా మార్చాలి. దీనిద్వారా మంచి ఫలితాలు సాధించవచ్చు" అని చంద్రబాబు పేర్కొన్నారు. తొలుత పేదరిక నిర్మూలనపై దృష్టి పెట్టాలని... రెండో దశలో అసమానతల తగ్గింపుకోసం ప్రయత్నం చేయాలని సూచించారు. ఆర్థికంగా అగ్రభాగంలో ఉన్న 10 శాతం మంది .. అట్టడుగున ఉన్న 20 శాతం జనాభాకు చేయూతనిచ్చేందుకు ముందుకు రావాలన్నారు. ఈ విధానం ద్వారా పేదరిక నిర్మూలన జరుగుతుందని అభిప్రాయపడ్డారు.

**ప్రైవేటు భాగస్వామ్యంతో...**

ఓడరేవులు, విమానాశ్రయాలు, లాజిస్టిక్స్ పార్కులు, అంతర్గత జల మార్గాలు, రైల్వేలు, ఫ్రైట్ కారిడార్లు, ఎక్స్‌ప్రెసవేలు మొదలైన రంగాల్లో ప్రైవేట్ రంగం భాగస్వామ్యంతో త్వరగా ఫలితాలు సాధించవచ్చునని చంద్రబాబు పేర్కొన్నారు. సాంకేతికతను ఉపయోగించుకోవడం ద్వారా ఇంధన రంగంలో అద్భుతాలు సృష్టించవచ్చన్నారు. తద్వారా చమురు దిగుమతులపై ఆధారపడాల్సిన అవసరముండదని తెలిపారు. భవిష్యత్తు అవసరాలకు సంబంధించిన పాఠ్యాంశాలను విద్యార్థులకు అందించాలన్నారు. భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని 'డెమోగ్రఫిక్ మేనేజ్‌మెంట్'ను సిద్ధం చేసుకోవాలని సూచించారు. డేటా అనలిటిక్స్, ఏఐ, రోబోటిక్స్ వాడకంతో రోగ నిర్ధారణ, ఆరోగ్య సేవల ఖర్చును భారీగా తగ్గించవచ్చన్నారు. ప్రజలు మరోసారి మోదీ నాయకత్వంపై విశ్వాసం ఉంచారనేందుకు హరియాణా అసెంబ్లీ ఎన్నికల ఫలితాలే నిదర్శనమన్నారు. మహారాష్ట్ర, జార?ండ్‌లలోనూ ఎన్డీయే కూటమిదే విజయమని ధీమా వ్యక్తం చేశారు. గుజరాత్ సీఎంగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి నేటి దాకా మోదీ కీ ఓటమే లేదని అన్నారు.

**మోదీ ప్రశంసలు...**

చంద్రబాబు సూచనలు, ప్రతిపాదనలను పలువురు సీఎంలు, ప్రధాని మోదీ అభినందించారు. కొన్ని అంశాలను ఆ తర్వాత మోదీ చేసిన ప్రసంగంలో ప్రస్తావించారు. గతంలో కశ్మీర్‌లో జరిగిన ఎన్డీయే మీటింగ్‌లో తాను, చంద్రబాబు అప్పటి ప్రధాని వాజపేయికి చెప్పిన వివరాలను మోదీ గుర్తు చేశారు. సంస్కరణలతో పేదలకు లబ్ధి జరుగుతుందని... అంతిమంగా ప్రజల జీవన ప్రమాణాలు పెరుగుతాయని నాడు తాము చెప్పామని మోదీ అన్నారు.

# సుప్రీంకోర్టు తదుపరి సీజేఐగా జస్టిస్ సంజీవ్ ఖన్నా!

(మొదటి పేజీ తరువాయి)

న్యూఢిల్లీ,: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ తన వారసుడి పేరును ప్రకటించారు. తదుపరి చీఫ్ జస్టిసగా జస్టిస్ సంజీవ్ ఖన్నా పేరును ఆయన సిఫారసు చేశారు. వచ్చేనెల 10వ తేదీన జస్టిస్ చంద్రచూడ్ పదవీకాలం ముగియనుంది. దిగిపోయే ముందు సుప్రీంకోర్టులోని సీనియర్ న్యాయమూర్తి పేరును చీఫ్ జస్టిస్ పదవికి సిఫారసు చేయడం ఆనవాయితీ. ఈ సంప్రదాయాన్ని అనుసరించి బుధవారం జస్టిస్ సంజీవ్ ఖన్నా పేరును ప్రతిపాదిస్తూ కేంద్ర న్యాయశాఖకు జస్టిస్ చంద్రచూడ్ లేఖ రాశారు. అనంతరం.. కేంద్ర న్యాయశాఖ ప్రధానమంత్రి పరిశీలనకు పంపుతుంది. ప్రధాని ఆమోదం తర్వాత రాష్ట్రపతి సిఫారసుకు పంపుతారు. చివరిగా రాష్ట్రపతి ఆమోదం పొందిన తర్వాత భారత ప్రధాన న్యాయమూర్తి నియామక ప్రక్రియ పూర్తవుతుంది. కేంద్ర ప్రభుత్వం స్థాయిలో లాంఛనాలు సజావుగా పూర్తయితే జస్టిస్ సంజీవ్ ఖన్నా సుప్రీంకోర్టు 51వ ప్రధాన న్యాయమూర్తిగా నవంబరు 11వ తేదీన బాధ్యతలు తీసుకుంటారు. ఆరు నెలలకు అటుఇటుగా, అంటే వచ్చే ఏడాది మే 13వ తేదీ వరకు ఆయన ఈ పదవిలో ఉంటారు. జస్టిస్ చంద్రచూడ్ తర్వాత సీనియారిటీలో రెండోస్థానంలో ఉన్న ఆయన.. ప్రస్తుతం నేషనల్ లీగల్ సర్వీస్ అథారిటీ (నల్సా) ఎగ్జిక్యూటివ్ చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. కాగా, జస్టిస్ చంద్రచూడ్ 2022 నవంబరు తొమ్మిదిన సీజేఐగా జస్టిస్ ఎన్వీ రమణ నుంచి బాధ్యతలు స్వీకరించారు. ఎమర్జెన్సీ కాలంలో గుర్తుండే అనేక తీర్పులు రాసిన సుప్రీంకోర్టు రిటైర్డు న్యాయమూర్తి జస్టిస్ హన్స్‌రాజ్ ఖన్నా మేనల్లుడే జస్టిస్ సంజీవ్ ఖన్నా. రాజ్యాంగానికి ఎన్ని సవరణలు ప్రతిపాదించినా, దాని మౌలిక స్వరూపాన్ని మాత్రం మార్చడానికి వీల్లేదంటూ 1973లో కేశవానంద భారతీ కేసులో చరిత్రాత్మక తీర్పును ఇచ్చిన న్యాయమూర్తుల ధర్మాసనంలో ఆయన ఒకరు. ఎమర్జెన్సీ అమలులో ఉండగా, అన్ని హక్కులతోపాటు జీవించే హక్కు, వ్యక్తిగత స్వేచ్ఛ కూడా రద్దయి పోతాయంటూ.. ఏడీఎమ్ జబల్‌పూర్ కేసులో సుప్రీంకోర్టు 1976లో తీర్పు ఇచ్చింది. ఈ తీర్పు రాసిన ధర్మాసనంలోని మెజారిటీ జడ్జీలతో విభేదించి, వేరుగా తీర్పు రాసిన ఒకే ఒక న్యాయమూర్తి జస్టిస్ ఖన్నా. దీంతో సీనియారిటీ రీత్యా చీఫ్‌జస్టిస్ కావాల్సిన ఆయనను, ఆ పదవి చేపట్టకుండా అప్పటి కేంద్ర ప్రభుత్వం అడ్డుకుంది. దీనికి నిరసనగా ఆయన సర్వీసు ఉండగానే తన పదవికి రాజీనామా చేశారు. జస్టిస్ ఖన్నాకు అలా ఆనాడు చేజారిన ఆ పదవిని ఆయన బంధువు జస్టిస్ సంజీవ్ ఖన్నా త్వరలో చేపడుతుండటం విశేషం.

# సుందరీకరణ కాదు.. పునరుజ్జీవం!

(మొదటి పేజీ తరువాయి)



దోపిడీ చేసి స్వేచ్ఛగా తిరుగుతున్నారు. మూసీ పునరుజ్జీవన ప్రయత్నాలపై విష ప్రచారంతో ప్రజల్లో అపోహలు సృష్టిస్తున్నారు. మూసీ మురికిని మించి మెదడులో విషం నింపుకుని తెలంగాణ సమాజంపై దాడి చేస్తున్నారు..' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మండిపడ్డారు. గురువారం సచివాలయంలో మంత్రులు డి.శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 'ఇది సుందరీకరణ కాదు.. దుబాయ్‌కి వెళ్లి నెత్తిమీద జుట్టును నాటు వేయించుకున్న విధానం కాదు. పునరుజ్జీవంతో మూసీని, మురికిలో కాలం వెళ్లదీస్తున్న ప్రజలను కాపాడి మంచి జీవనాన్ని ఇవ్వాలని, ఉపాధి కల్పించాలని, ప్రత్యామ్నాయ ఇళ్లను ఇవ్వాలనే ఆలోచన మాకు ఉంది. కానీ పేదరికం, కట్టుబానిసలు ఉండాలనే దొరలు, భూస్వాములు, జమీందారుల భావజాలం ఉన్నవారు దీనికి అడ్డుపడుతున్నారు. అక్కడి ప్రజల భవిష్యత్తుపై అపోహలు సృష్టిస్తున్నారు. నిజానికి 4 కోట్ల తెలంగాణ ప్రజల భవిష్యత్తును, రాష్ట్ర, దేశ ఆర్థిక వ్యవస్థను నిర్దేశించగల కార్యాచరణ ఇది. గత 10 నెలల పాటు అధికారులు 33 బృందాలుగా ఏర్పడి మూసీ దుర్గంధంలో దుర్భర జీవితాన్ని అనుభవిస్తున్న ప్రతి ఇంటికీ వెళ్లి వారి కష్టాలు, వివరాలను తెలుసుకున్నారు. వారిని ఏ విధంగా ఆదుకోవాలనే అంశంపై మేం ఆలోచన చేస్తున్నాం. అక్కడి సమస్యలు పరిష్కరించి ఒక్కొక్కరిని ఒప్పించి తరలిస్తాం..' అని సీఎం స్పష్టం చేశారు. 'గత బీఆర్ఎస్ ప్రభుత్వం మల్లన్నసాగర్ భూసేకరణ కోసం వేములఘాట్ ప్రజలపై అర్ధరాత్రి పోలీసులతో దాడి చేయించి గుర్రాలతో తొక్కించినట్టుగా మేం చేయం. ఇక్కడికి వస్తావా? అక్కడికి వస్తావా? అని నన్ను అడుగుతున్నారు. వారు ప్రాతినిధ్యం వహిస్తున్న సిద్దిపేట, గజ్వేల్‌లోని ఏటిగడ్డ కిష్టాపూర్, వేములఘాట్, మల్లన్నసాగర్, రంగనాయకసాగర్, కొండపోచమ్మకు నేను సెక్యూరిటీ లేకుండా వస్తా. బీఆర్ఎస్ నేతలూ రావాలి. రచ్చబండ నిర్వహించి పదేళ్లలో ఎన్ని దుర్మార్గాలు చేశారో ప్రజలను అడుగుదాం..' అని రేవంత్ సవాల్ చేశారు. 'మూసీ గర్భంలో 1,690 ఇళ్లు ఉండగా వారికి దసరా పండుగ వేళ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లతో పాటు రూ.25 వేలు చొప్పున తోవ ఖర్చులకు ఇచ్చాం. అయితే హైడ్రా వస్తుంది..బుల్డోజర్లు పెడ్తున్నరు అని తప్పుడు ప్రచారం చేస్తున్నారు. మూసీలో ప్రభుత్వం ఒక్క ఇల్లు కూలగొట్టలేదు. ఖాళీ చేసిన లబ్ధిదారులే తమ ఇళ్ల తలుపులు, కిటికీల కోసం కూలగొట్టుకున్నారు. అడ్డగోలుగా కట్టిన 10, 20 అంతస్తుల ఆకాశహర్మ్యాలను కూల్చడానికే బుల్డోజర్లు, హైడ్రా అవసరం. అయినా హైడ్రా ఏమైనా ఫామ్‌హౌస్‌లో నిద్రపోయే భూతుమా? మీద పడడానికి? మరో 10 వేల ఇళ్లు బఫర్‌జోన్‌లో ఉన్నాయి వారికి ప్రత్యామ్నాయం కల్పించి, మంచి జీవితాలు ఇచ్చి మనసు గెలవాలని భావిస్తున్నాం..' అని ముఖ్యమంత్రి చెప్పారు. 'ప్రపంచంలో అద్భుతాలను సృష్టించిన ఐదు కంపెనీలతో ఒక కన్సార్టియం ఏర్పాటు చేయించి రూ.141 కోట్లతో మూసీ పునరుజ్జీవనం ప్రాజెక్టు డీపీఆర్ తయారీ బాధ్యతలను టెండర్ల ద్వారా అప్పగించాం. డీపీఆర్ తయారీతో పాటు అంచనా వ్యయం, నిధులు, పెట్టుబడులు, రుణాల సమీకరణకు సంబంధించి కన్సార్టియం సహకారం అందిస్తుంది.

# నవంబర్ మొదటివారంలో దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభం

నిర్వహిస్తారు. మెయిన్స్‌లో అర్హత సాధించిన వారిలో 2.5 లక్షల మందిని అడ్వాన్స్‌డ్‌కు పంపుతారు. అడ్వాన్స్‌డ్‌లో పొందిన ర్యాంకుల ఆధారంగా ఐఐటీల్లో సీట్లు కేటాయిస్తారు. జేఈఈ మెయిన్స్ ర్యాంకు ద్వారా ఎన్ఐటీలు, ట్రిపుల్ ఐటీలు, కేంద్ర ప్రభుత్వ నిధులతో నడిచే సంస్థల్లో ఇంజనీరింగ్ సీట్లు పొందే వీలుంది. ఈ పరీక్షను దృష్టిలో ఉంచుకుని తెలంగాణ వ్యాప్తంగా పరీక్ష కేంద్రాలపై దృష్టి పెట్టారు. ఏయే కేంద్రాలను ఎంపిక చేయాలనే సమాచారాన్ని ఎన్‌టీఏ సేకరించినట్టు అధికార వర్గాలు తెలిపాయి. మొదటినుంచీ తెలంగాణ వ్యాప్తంగా 21 పట్టణాల్లో జేఈఈ మెయిన్స్ నిర్వహిస్తున్నారు. అయితే గత ఏడాది నుంచి పక్ష కేంద్రాలను కుదించారు. కరోనా నేపథ్యంలో విద్యార్థుల సంఖ్య తగ్గడంతో పరీక్ష కేంద్రాలను 17 పట్టణాలకే పరిమితం చేశారు. కాగా, గత ఏడాది జేఈఈ రాసే వారి సంఖ్య గణనీయంగా పెరిగింది. ఈ కారణంగా ఈ సంవత్సరం పరీక్ష కేంద్రాలను పెంచే అంశాన్ని పరిశీలిస్తున్నారు. గత సంవత్సరం జేఈఈ మెయిన్స్, అడ్వాన్స్‌డ్‌కు కూడా పరీక్ష సిలబస్‌ను తగ్గించారు. 2020లో కరోనా కారణంగా 8 నుంచి 12వ తరగతి వరకూ కెమిస్ట్రీ, మ్యాథ్స్, ఫిజిక్స్‌లో కొన్ని చాప్టర్లను తీసివేశారు. దీనిని దృష్టిలో ఉంచుకుని సీబీఎస్ఈతో పాటు ఇతర జాతీయ సిలబస్ ఉండే విద్యార్థులకు జేఈఈలో ఆయా చాప్టర్లను తొలగించాలనే డిమాండ్ వచ్చింది. ఈ కారణంగా గత సంవత్సరం కొన్ని చాప్టర్లను ఇవ్వలేదు. అయితే, ఈ ఏడాది ఆ సమస్య లేదని అధికారులు భావిస్తున్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని పాత సిలబస్‌ను మళ్లీ కలపడమా? లేదా ఈ సంవత్సరం కూడా గత ఏడాది మాదిరిగానే నిర్వహించడమా? అనే దానిపై ఎన్‌టీఏ, ఇతర కేంద్ర సంస్థలు నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది.

# ప్రియాంక ప్రత్యర్థి సత్యన్ మొకెరి

(మొదటి పేజీ తరువాయి)

తిరువనంతపురం: వయనాడ్ లోక్‌సభ ఉప ఎన్నికలో కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీపై పోటీకి వామపక్ష ఎల్డీఎఫ్ సత్యన్ మొకెరిని ఎంపిక చేసింది. సీపీఐకి చెందిన మొకెరి కొజికోడ్ జిల్లాలోని నాదపురం మాజీ ఎమ్మెల్యే. వ్యవసాయ రంగానికి చెందిన సమస్యలపై పనిచేసిన వ్యక్తిగా ఆయనకు గుర్తింపు ఉంది. వయనాడ్‌లో సత్యన్ మొకెరి ఎల్డీఎఫ్ అభ్యర్థిగా ఉంటారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి బినోయ్ విశ్వమ్ గురువారం ప్రకటించారు.% మొకెరి 2014 వయనాడ్ నుంచి పోటీచేసి కాంగ్రెస్ అభ్యర్థి ఎం.ఐ.షానవాజ్ చేతిలో దాదాపు 20 వేల ఓట్ల తేడాతో పరాజయం పాలయ్యారు. రాహుల్ గాంధీ సార్వత్రిక ఎన్నికల్లో రెండు చోట్ల గెలిచి రాయ్‌బరేలి ఎంపీగా కొనసాగుతూ వయనాడ్‌కు రాజీనామా చేయడంతో ఉప ఎన్నిక వచ్చిన విషయం తెలిసిందే. నవంబరు 13న వయనాడ్‌లో పోలింగ్ జరగనుంది.

# మూసీపై సీఎం తీరు అర్థరహితం: కేటీఆర్

(మొదటి పేజీ తరువాయి)



మూసీ ప్రక్షాళన విషయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీరు అర్థరహితంగా ఉందని బీఆర్ఎస్ ధ్వజమెత్తింది. మూసీ నది ప్రక్షాళనకు సంబంధించి బీఆర్ఎస్ అధికారంలో ఉన్న సమయంలో చేపట్టిన కార్యక్రమాలపై శుక్రవారం కీలక ప్రజెంటేషన్ ఇస్తున్నట్లు ప్రకటించింది. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు తెలంగాణ భవన్‌లో శుక్రవారం సాయంత్రం నాలుగు గంటలకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తారని తెలిపింది. మూసీ నది ప్రక్షాళనలో భాగంగా ఇప్పటికే గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో పలు మురుగునీటి శుద్ధీకరణ ప్లాంట్లను ప్రతిపాదించి, చాలా వరకు పూర్తి చేసినట్లు కేటీ రామారావు పలు సందర్భాల్లో వెల్లడించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన పలు ఎస్‌టీపీల నిర్మాణ పనులను ఇటీవల కేటీ రామారావు పార్టీ ఎమ్మెల్యేలతో కలసి సందర్శించారు.

# బలంగా ఎదుగుదాం.. పార్టీని పటిష్టంగా నిర్మిద్దాం



(మొదటి పేజీ తరువాయి)

అమరావతి: గ్రామ, బూత్ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని మరింత వ్యవస్థీకృతంగా నిర్మించడం ద్వారా దేశంలోనే బలమైన పార్టీగా నిలుపుదామని ఆ పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. మన పార్టీ ఏర్పాటు చేసుకుని దాదాపు 15 ఏళ్లు అవుతోందని, ఈ సమయంలో వివిధ రకాల ఎన్నికలు చూశామని చెప్పారు. ప్రతిపక్షంలో ఉన్నామని.. అధికారంలోనూ ఉన్నామని.. స్థానిక సంస్థలతో పాటు చాలా ఎన్నికల్లో పాల్గొన్నామని గుర్తు చేశారు. మళ్లీ ఇప్పుడు ప్రతిపక్షంలో ఉన్నామని, గ్రామ స్థాయి నుంచి ప్రతి అడుగులోనూ పార్టీ యుద్ధం చేస్తోందని చెప్పారు. ఈ నేపథ్యంలో పార్టీ వ్యవస్థీకృతంగా ముందుకు సాగితేనే మంచి ఫలితాలను ఇస్తుందని, అప్పుడే మనం రాష్ట్ర స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు శక్తివంతంగా ఉంటామని ఉద్బోధించారు. లోటుపాట్లు సరిదిద్దుకోవడానికి ఇప్పుడు తగినంత సమయం ఉందని, దానిని సద్వినియోగం చేసుకుందామని కోరారు. శాసనసభ, పార్లమెంటుకు జమిలి ఎన్నికలు నిర్వహిస్తామంటున్నారని.. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా సమర్థవంతంగా ఎదుర్కొనేలా పార్టీని సంస్థాగతంగా మరింత బలోపేతం చేద్దామని జిల్లా అధ్యక్షులు, అనుబంధ విభాగాల అధ్యక్షులకు దిశానిర్దేశం చేశారు. పార్టీ నిర్మాణంలో మహిళలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో గురువారం రాష్ట్ర స్థాయి వర్క్ షాప్ నిర్వహించారు. ఈ వర్క్ షాప్‌లో వైఎస్ జగన్ ఇంకా ఏమన్నారంటే..

గ్రామ, బూత్ కమిటీలతో మరింత బలోపేతం

ఇప్పుడు మనం రాష్ట్ర స్థాయి నుంచి జిల్లా కమిటీలు, నియోజకవర్గ స్థాయి, మండల, గ్రామ స్థాయి కమిటీల వరకు ఎలా ఉన్నాయన్న దానిపై పరిశీలన, అవగాహన పెంచుకోవాలి. ప్రతి ఒక్కరూ తమ పాత్రలను నిర్వర్తించాలి. ఆ దిశగా అడుగులు వేయాలి. మరో ఆరు నెలల్లో మళ్లీ సమావేశం నాటికి గ్రామ స్థాయి వరకు కమిటీలు ఏర్పాటు కావాలి. అక్కడే యూత్, మహిళా, విద్యార్థి విభాగాలతో పాటు విలేజ్ కమిటీ, బూత్ కమిటీల వంటి అనుబంధ విభాగాలకు గ్రామ స్థాయిలో కూడా కమిటీలు ఏర్పాటు కావాలి. ఈ కమిటీల ఏర్పాటు కాగితాలకే పరిమితం కాకూడదు. దాని వల్ల పార్టీకి ఎలాంటి లాభం ఉండదు. కమిటీల ఏర్పాటుపై మీ పర్యవేక్షణ, పరిశీలన ఉండాలి. ఇలా చేయగలిగితే.. దేశంలోకెల్లా నంబర్ వన్ పార్టీగా ఎదుగుతాం. పార్టీ క్షేత్ర స్థాయి నిర్మాణంలో మహిళలకు ప్రాధాన్యత ఇవ్వాలి. గ్రామ స్థాయి నుంచి మనకు కమిటీలు, నాయకత్వం లేక కాదు. ప్రతి గ్రామంలోనూ ఆ గ్రామ సర్పంచ్ లేదా, పోటీ చేసిన అభ్యర్థి మన పార్టీ వారే ఉన్నారు. కాకపోతే వీరందరినీ నిర్మాణాత్మక వ్యవస్థల్లోకి తీసుకురావాలి. అప్పుడు మనం రాష్ట్ర స్థాయిలో ఇచ్చిన పిలుపునకు గ్రామ స్థాయి వరకు ఉధృత స్పందన వస్తుంది. అది చేయగలగాలి. ఇవాళ వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు ఎవరైనా సగర్వంగా కాలర్ ఎగరేసుకుని ప్రతి ఇంటికీ వెళ్లగలం. కారణం మనం చెప్పిన ఎన్నికల మేనిఫెస్టో అన్నదాన్ని చెత్తబుట్టలో వేసే డాక్యుమెంటు కింద కాకుండా.. దేశ చరిత్రలోనే సరికొత్త అర్థం తీసుకువచ్చిన పార్టీ మనది. మేనిఫెస్టోను భగవద్గీత, బైబిల్, ఖురాన్‌గా భావిస్తూ దానిలో చెప్పినవి తూచ తప్పకుండా అమలు చేశాం.

# గాలి కుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమము



**సంగారెడ్డి అర్బన్, అక్టోబర్ 17 (డైలీ రిపోర్ట్):** సంగారెడ్డి జిల్లాలో జాతీయ పశువ్యాధి నివారణ కార్యక్రమము(ఎన్ ఎ డిసిపి) 5వ విడత గాలి కుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ . వల్లూరు క్రాంతి మరియు జిల్లా స్పెషల్ జడ్జి (ఎస్సీ/ఎస్టీ-పి ఓ ఏ) సునీత రవీందర్ రెడ్డి సంగారెడ్డి లోని వైకుంటపురం గోశాలలో ప్రారంబించారు. ఈ కార్యక్రమములో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గాలి కుంటు వ్యాధి ద్వారా రైతులు తీవ్రంగా నష్టపోతారు, రైతులు ఈ వ్యాధి సోకకుండా తమ పశువులకు తప్పనిసరిగా గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించుకోవాలని తెలిపారు. పశువైద్య సిబ్బంది అన్ని గ్రామాలలో ముందస్తు సమాచారంతో వెళ్లి టీకాలు వేసి భారత్ పశుదాన్ యాప్ లో వివరాలు పొందుపరచాలని కోరారు. ఈ కార్యక్రమములోజిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో తెల్లజాతి పశువులు 99188 నల్లజాతి పశువులు 113828 మొత్తం 213016 ఉన్నాయని, ఇట్టి పశువులకు ప్రతి సంవత్సరం రెండుసార్లు గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఇట్టి టీకాల కార్యక్రమము, పశువులు కలిగిన ప్రతి రైతు పశు వులకు టీకాలు వేయించాలని చెప్పడం జరిగింది. పశువులకు గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించకపోతే పశువులలో పాలోత్పత్తి తగ్గుతుంది మరియు సంతానోత్పత్తి కుడా తగ్గిపోతుంది. ఈ టీకాలు 4 నెలలు పైబడిన ప్రతి పశువుకు ఇప్పించుకోవాలలని కోరారు. ఈ కార్యక్రమము నవంబర్ 14th వరకు జరగనుందని , కావున ప్రతి రైతు వారి పశువులకు గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించుకోవాలని తెలిపారు. వైకుంటపురం గోశాలలో మొత్తం 145 ఆవులకు టీకాలు ఇచ్చారు. ఈ కార్యక్రమములో డా. వసంత కుమారి, జిల్లా పశువైద్య మరియు పశు సంవర్ధక శాఖ అధికారి, వైకుంటపురం గోశాల నిర్వాహకులు, వరదాచార్యులు, జిల్లా సహాయ సంచాలకులు డా. సి. హెచ్. రవీంద్ర ప్రసాద్ మరియు జిల్లా సహాయ సంచాలకులు డా. రాజేశ్వర్ లు, పశువైద్య సహాయ శస్త్ర చికిత్సకులు డా. యామిని, డా. అజిత్ చంద్ర మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## ఉపాధ్యాయ కౌన్సిలింగ్లో అక్రమాలకు పాల్పడిన డీఈవో ను తొలగించాలి

### టీఎస్ యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రాజు డిమాండ్

**భద్రాద్రి కొత్తగూడెం అక్టోబర్ 17 (డైలీ రిపోర్ట్):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఇటీవల నిర్వహించిన 20 24 డిఎస్సీ కౌన్సిలింగ్ లో ఉద్దేశపూర్వకంగా అక్రమాలకు పాల్పడిన డీఈవో వెంకటేశ్వర చారిని, ఏపీవో కిరణ్ కుమార్ తక్షణమే తొలగించాలని టీఎస్ యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రాజు డిమాండ్ చేశారు. గురువారం కౌన్సిలింగ్లో జరిగిన అక్రమాలను ఉదాహరణలతో ప్రదర్శిస్తూ జిల్లా విద్యాశాఖ కార్యాలయం ఎదుట ఆ సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా విద్యాశాఖ అధికారి ఉద్దేశపూర్వకంగా అక్రమాలకు పాల్పపడ్డాడని ఆరోపించారు. మొలకలపల్లి మండలం ఎంపీ యుపిఎస్ సీతాయుగూడెం పాఠశాలను వేకెన్సీ లిస్ట్ లో చూపకుండా పాఠశాలలో సోషల్ ఉపాధ్యాయుని నియామకం చేశారన్నారు. పాల్వంచ పట్టణ పరిధిలోని జడ్పీఎస్ఎస్ బొలోరు గూడెంలో 600 మంది పై చిలుకు విద్యార్థులు ఉన్న పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ పోస్ట్ ఆవశ్యకత ఉన్నప్పటికీ ఉపాధ్యాయ పోస్టులను కేటాయించకుండా, సీతయ్య గూడెం పాఠశాల కేటాయించి అక్రమాలకు పాల్పడ్డాడని ఆరోపించారు. కొత్తగూడెం పట్టణ పరిధిలోని జిహెచ్ఎస్ పాత కొత్తగూడెం పాఠశాలలో 254 మంది విద్యార్థులు ఇంగ్లీష్ వర్కింగ్ ఉపాధ్యాయులు ఒక్కరే ఉన్న ఇంగ్లీష్ పోస్ట్ ఆవశ్యకతను గుర్తించకుండా అంతకు తక్కువగా ఉన్న విద్యార్థుల పాఠశాలలకు ఉపాధ్యాయుల నియమించి నిబంధనలో తుంగలో తొక్కారని ద్వ జమెత్తారు . ఓ ఉపాధ్యాయ సంఘానికి వత్తాసు పలుకుతూ నిబంధనలను తుంగలో తొక్కి విద్యార్థులకు అన్యాయం చేసిన డీఈఓ వెంకటేశ్వర చారి, ఏపీఓ కిరణ్ కుమార్ లపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.



# సిఎస్ఆర్ నిధులు స్థానిక అభివృద్ధికి కేటాయించండి..

### జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతిని కోరిన ఎమ్మెల్యే జిఎంఆర్..



**పటాన్చెరు ,అక్టోబర్ 17( డైలీ రిపోర్ట్):** పటాన్చెరు నియోజకవర్గం పరిధిలోని పరిశ్రమల నుండి కేటాయించబడిన సి.ఎస్.ఆర్ నిధులను స్థానిక గ్రామాలు, పట్టణాల అభివృద్ధికి కేటాయించాలని జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతిని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి కోరారు. గురువారం సంగారెడ్డి లోని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ వల్లూరి క్రాంతితో ఎమ్మెల్యే జిఎంఆర్ కలిసి పలు అంశాలపై విజ్ఞాపన పత్రం అందించారు. ప్రధానంగా పటాన్చెరు నియోజకవర్గ పరిధిలోని జిన్నారం, గుమ్మడిదల, పటాన్చెరు మండలాల పరిధిలో గల వందలాది పరిశ్రమలు తమ లాభాల్లో కొంత భాగాన్ని కార్పొరేట్ సామాజిక బాధ్యత (సి ఎస్ ఆర్) కి కేటాయించి, గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి పనులకు సహకారం అందిస్తున్నారని తెలిపారు. ఈ నిధులను స్థానిక అభివృద్ధికి కాకుండా జిల్లాలోని ఇతర ప్రాంతాలకు కేటాయించడం మూలంగా, పరిశ్రమలకు భూములు అందించి కాలుష్యం మూలంగా ఇబ్బంది పడుతున్న స్థానిక గ్రామాల ప్రజలు అభివృద్ధికి దూరం అవుతున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో.. పరిశ్రమలు నెలకొల్పిన గ్రామాల పరిధిలోనే సిఎస్ఆర్ నిధులు ఖర్చు చేసేలా ఆదేశాలు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. నియోజకవర్గ పరిధిలోని వివిధ గ్రామాల పరిధిలో అభివృద్ధి పనులు చేపట్టి బిల్లులు రాక తాజా మాజీ ప్రజా ప్రతినిధులు, కాంట్రాక్టర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. నూతన పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో అభివృద్ధి కుంటుపడుతోందని తెలిపారు. పెండింగ్ బిల్లులు త్వరగా చెల్లించేలా ఆదేశాలు జారీ చేయాలని కోరారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన కలెక్టర్ త్వరలోనే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.



## వికారాబాద్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

పూడూరు,అక్టోబర్ 17( డైలీ రిపోర్ట్): వికారాబాద్ జిల్లాలో ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. పూడూరు గేట్ వద్ద ఆర్టీసీ బస్సు - బైక్ ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ఆర్టీసీ బస్సు, బైకు ఢీకొనడంతో ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందారు.ఎస్ఐ మధుసూదన్ రెడ్డి తెలిన వివరాల ప్రకారం మేడికొండ గ్రామనికి చెందిన యువకులు నవీన్, అరుణ్, పండు గా గుర్తించారు అతి వేగంతో రాంగ్ రూట్ లో వచ్చి ఆర్ టి సి బస్ కి డీ కొట్టడంతో అక్కడికి అక్కడే మృతి చెందినట్టు తెలిపారు.వారు మేడికొండ గ్రామస్తులు అని తెలిపారు.

## ఇందిరమ్మ గృహ నిర్మాణ గ్రామ కమిటీ నియామకం



**సిద్దిపేట, అక్టోబర్ 17 (డైలీ రిపోర్ట్):** సిద్దిపేట జిల్లా నంగునూరు మండల కేంద్రంలో గురువారం రోజున గ్రామపంచాయతీ కార్యాలయంలో గ్రామ కార్యదర్శి చంద్రకళ కి గ్రామంలో వేసినటువంటి ఇందిరమ్మ గృహ నిర్మాణ కమిటీ వివరాలను అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు శివ గౌడ్ ఇందిరమ్మ కమిటీ మెంబర్ సంపత్ దాసరి కిషన్ తుపాకుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

## రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ ను కలిసిన శంకర్‌పల్లి మాజీ ఎంపిటిసి బిసోల్ల అశోక్ కుమార్





శంకర్‌పల్లి: అక్టోబర్ 17: (డైలీ రిపోర్ట్): రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకయ్యను గురువారం నగరంలోని ఆయన కార్యాలయంలో శంకర్‌పల్లి మాజీ ఎంపిటిసి బిసోల్ల అశోక్ కుమార్ ఆయనకు పుష్పగుచ్ఛం ఇచ్చి, మర్యాదపూర్వకంగా కలిశారు. శంకర్‌పల్లి మున్సిపల్, మండల పరిధిలో ఎస్సీ, ఎస్టీ వర్గాల ప్రజలకు ఏవైనా సమస్యలు ఉంటే నా దృష్టికి తీసుకురావాలని చైర్మన్ తెలిపినట్టు మాజీ ఎంపిటిసి పేర్కొన్నారు.

# ప్రజా సమస్యలు పరిష్కరించని కమిషనర్ మాకెందుకు...?

### బహుజన్ సమాజ్ పార్టీ పిఠాపురం ఇన్చార్జి ఖండవల్లి లోవరాజు

**పిఠాపురం, డైలి రిపోర్ట్ :** ప్రజా సమస్యలు పరిష్కరించని పిఠాపురం మున్సిపల్ కమిషనర్ మాకు అవసరం లేదని బహుజన్ సమాజ్ పార్టీ కాకినాడ జిల్లా ప్రధాన కార్యదర్శి, పిఠాపురం నియోజవర్గం ఇంచార్జ్ ఖండవల్లి లోవరాజు అన్నారు. వివరాల్లోకి వెళితే పిఠాపురం మున్సిపాలిటీ పరిధిలో 25వ వార్డు ఎస్.సి. పేట నందు పబ్లిక్ వాడకం నీరు, ఎస్సీ పేట మీదుగా సుమారు 6 వార్డులకు సంబంధించిన నీరు పిఠాపురం మున్సిపాలిటీ పరిధిలో 25వ వార్డు, ఎస్.సి.పేట నందు మున్సిపాలిటీ అధికారులు ఈ మార్గం ద్వారా పంపిస్తూ ఉన్నారు. కానీ మున్సిపాలిటీ పర్మినెంట్ అయిన కాలువ లేదు కాబట్టి, అక్కడ రైతు పంట కాలువలోనికి వదులుతున్నారని లోవరాజు ఆరోపించారు. వర్షాకాలంలో ఆ మురుగునీరు వారి పొలాలలో నిల్వ ఉండడం వలన అక్కడ దోమలు, క్రిమి కీటకాలు చేరి పేటలోని ప్రజలు రోగాలు బారిన పడుతున్నారన్నారు. 2014వ సంప్వరములో తాను టిడిపి కౌన్సిలర్ గా ఉన్నప్పుడు ఎన్నోసార్లు కౌన్సిల్ మీటింగ్లో అడిగానని, కానీ దీనిపై ఎవరూ స్పందించలేదన్నారు. ఆ రైతు భూమిలోకి వదలుతుండడం వలన ఎస్సీ పేట ప్రజలకు ఎన్నో రోగాలు వస్తున్నాయని, కానీ దీనిపై ఎటువంటి స్పందన ఇప్పటికీ కూడా లేదని, మున్సిపల్ అధికారులు దృష్టి పెట్టలేదన్నారు. ఆ రైతు భూమిని మెరక చేస్తే ఈ వచ్చే మురికి నీరు ఎస్సీ పేటను ముంచెత్తుతుందన్నారు. ఇప్పటికైనా మున్సిపాలిటీ అధికారులు స్థిరమైన కాలువను ఏర్పాటు చేయవలసినదిగా కోరామన్నాను. ఈ విషయమై జిల్లా కలెక్టర్ షన్మోహన్ సగిలి కు



గ్రీవెన్స్ లో పిర్యాదు చేయడం జరిగిందన్నారు. దీనిపై దృష్టి సారించిన కలక్టరేట్ సిబ్బంది తక్షణమే సమస్య పరిష్కరించాలని పిఠాపురం మున్సిపల్ కమిషనర్ కు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం పిర్యాదు దారుడు ఖండవల్లి లోవరాజుకు కలక్టరేట్ సిబ్బంది ఫోన్లో సంప్రదించి తమ సమస్య పరిష్కారం అయ్యిందా..? అని అడగడం జరిగిందని, దానికి తన సమస్య పరిష్కారం అవ్వలేదని, సమస్య వున్న ప్రాంతానికి మున్సిపల్ అధికారులు వచ్చి



పరిశీలించారని, శాశ్వత పరిష్కారం ఏర్పాటు చేయడానికి 40 రోజులు గడువు కావాలని మున్సిపల్ కమిషనర్ కోరారని కలెక్టరేట్ సిబ్బందికి తెలియజేశామన్నారు. సమస్య పరిష్కారం కాలేదు కానీ అదే కాలువపై పని చేసినట్టు నకిలీ బిల్లులు చూపించి వాటిపై సొమ్ములు చేసుకుంటున్నారని లోవరాజు ఆరోపించారు. ప్రజా సమస్యల కోసం తాను కలిసేందుకు మున్సిపల్ కార్యాలయానికి వెళ్తున్న ఒక జాతీయ పార్టీ పిఠాపురం నియోజకవర్గ ఇన్చార్జి కే ఆయన దర్శనం కలగట్లేదు అంటే, సామాన్య ప్రజలు కలవడం జరిగే పని కాదన్నారు. అటువంటి వ్యక్తి పిఠాపురం మున్సిపాలిటీలో ఉండడం సరికాదని, ఇప్పటికే కమిషనర్ పై పలు ఆరోపణలు వచ్చాయన్నారు. పిఠాపురం శాసనసభ్యుడు, రాష్ట్ర డిప్యూటీ సీఎం కొణిదల పవన్ కళ్యాణ్ తన ఫేషియల్ మంచి అధికారంలో నియమించుకుంటున్నారు తప్ప తనను ఓట్లు వేసి అసెంబ్లీ గెలిపించిన పిఠాపురం నియోజకవర్గ అధికారులపై కన్నెత్తైనా చూడట్లేదని లోవరాజు ఆరోపించారు. ఇదే సమస్యపై పిఠాపురం జనసేన పార్టీ ఇన్చార్జిగా వ్యవహరిస్తున్న మర్రెడ్డి శ్రీనివాస్ కూడా తన ఫిర్యాదు అందజేశానన్నారు. దీనిపై ఎటువంటి స్పందన అందలేదన్నారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న పిఠాపురం మున్సిపల్ కమిషనర్ కనకారావుపై ఎంక్వయిరీ నిమిత్తం విచ్చేసిన జేడీ, స్పెషల్ ఆఫీసర్లకు మళ్లీ తమ ఫిర్యాదును అందించడం జరిగిందన్నారు.

# అక్రమ గంజాయి రవాణా పై సంగారెడ్డి జిల్లా పోలీసుల ఉక్కుపాదం

**టాస్క్ ఫోర్స్ పోలీసుల ఆపరేషన్ లో నిషేదిత 40 కిలోల ఎండు గంజాయి, 50 గ్రాముల హష్ ఆయిల్ స్వాధీనం.**

**వివరాలు వెల్లడించిన జిల్లా ఎస్పీ శ్రీ చెన్నూరి రూపేష్ ఐపియస్.**










**డైలీ రిపోర్ట్, సంగారెడ్డి బ్యూరో అక్టోబర్ 17:** గంజాయి, హాష్ ఆయిల్ సరఫరా చేస్తున్న నిందితులను అరెస్టు చేయడం జరిగిందని సంగారెడ్డి జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్ తెలిపారు. నిందితుల వద్ద నుంచి 40 కిలోల ఎండు గంజాయి, 50 గ్రాముల హాష్ ఆయిల్ స్వాధీనం చేసుకున్నామని వివరించారు. గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ చెన్నూరి రూపేష్ మాట్లాడుతూ గురువారం ఉదయం మనూర్ ఎస్ఐ, ఎస్-న్యాబ్ సిబ్బందితో కలిసి మనూర్ మండలం, డవూర్ ఎక్స్ రోడ్డు వద్ద వాహనాల తనిఖీ నిర్వహించారు. నాగిల్ గిద్ద వైపు నుండి నారాయణఖేడ్ వైపు వస్తున్న ఒక స్విఫ్ట్ డిజైర్ కారుని ఆపి తనిఖీ చేయగా కారు డిక్కీలో ఎండు గంజాయి దొరికిందని తెలిపారు.కారు డ్రైవర్ బీదర్ రాష్ట్రం భాల్కి పట్టణం బిరదేవ్ కాలనీ, బసవేశ్వర్ చౌక్, కర్ణాటక రాష్ట్రానికి చెందిన వాడన్నారు. నిందితుడు మల్లగొండ దొంగతనం కేసులో బీదర్ జైలులో ఉండగా, అక్కడ మల్కాన్గిరి, ఒడిస్సా రాష్ట్రానికి చెందిన రాహుల్ చక్రవర్తి పరిచయమయ్యారని తెలిపారు. గత సెప్టెంబర్ నెలలో చిరాగ్ పల్లి పోలీసులు స్వాధీన పరుచుకున్న 140 కిలోల ఎండు గంజాయి ప్యాకెట్స్ తమవే నని, అప్పుడు పోలీసులకు దొరకకుండా తప్పించుకొని వెళ్ళిన డిజైర్ కారు నాదే అని ఒప్పుకున్నాడని వివరించారు. తన కారులో ఉన్న 40 కిలోల ఎండు గంజాయిని తరలిస్తుండగా మానూర్ పోలీస్ స్టేషన్ నందు కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. ఇంకా మల్లేష్ జాదవ్, దాదా పాటిల్, రాహుల్ చక్రవర్తిలు పరారీలో ఉన్నట్లు ఎస్పీ తెలిపారు.భీరంగూడ వేంకటేశ్వర స్వామి గుడి వద్ద ముగ్గురు వ్యక్తులు నిషేదిత హష్ ఆయిల్ (గంజాయి సంభందిత) వినియోగిస్తున్నారని నమ్మదగిన సమాచారం మేరకు అమీనపూర్ ఎస్ఐ విజయ్ రావ్ తన సిబ్బందితో కలిసి అక్కడికి వెళ్లి ఆ వ్యక్తులను అదుపులోకి తీసుకోవడం జరిగిందని ఎస్పీ రూపేష్ తెలిపారు. అరెస్టు చేసిన నిందితులను విచారించగా అఖిలేష్, ప్రేమ్,సాయి, శివ ముగ్గురు నిందితులు చదువుకునే రోజుల నుంచి కళాశాలలో హష్ ఆయిల్ తాగుటకు అలవాటుపడి బిలాల్, నివాసం సంగారెడ్డి, శంకర్, లింగంపల్లి ల వద్ద కొనుగోలు చేసి తాగే వారన్నారు. అరకులో సుబ్బారావు అనే వ్యక్తి వద్ద హష్ ఆయిల్ లభిస్తుందని తెలుసుకొని, వీళ్ళు వినియోగించుకోగా మిగిలిన హష్ ఆయిల్ అమ్మి డబ్బులు సంపాదించుకోవాలని దురుద్దేశంతో నిందితుడు సాయి అరకు వెళ్లి 50 గ్రాముల హష్ ఆయిల్ ను తీసుకొని వచ్చి బీరంగూడ వెంకటేశ్వర టెంపుల్ వద్ద 11 చిన్న, చిన్న డబ్బాలలో నింపి గుర్తు తెలియని వ్యక్తులకు విక్రయించడానికి వేచి చూస్తూ ఉండగా, అమీన్పూర్ పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకొని హష్ ఆయిల్ స్వాధీనపరచుకొని అమీన్ పూర్ పోలీసు స్టేషన్ లోకేసు నమోదు చేయడం జరిగిందన్నారు.జిల్లాలో మాదకద్రవ్యాల దుర్వినియోగంపై జిల్లా పోలీసు శాఖ ఉక్కుపాదం మోపడం జరుగుతుందని, ఎవరైనా గంజాయి లేదా ఇతర మాదక ద్రవ్యాలను సాగు, సరఫరా చేసిన సంగారెడ్డి జిల్లా ఎస్-న్యాబ్ నెంబర్ 8712656777 కు సమాచారం అందించాలని, వివరాలు తెలిపిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. కేసు ఛేదనలో కీలకంగా వ్యవహరించిన అధికారులను, సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించి, రివార్డ్ లు ప్రకటించారు. విలేకరుల సమావేశంలో పటాన్ చెర్వు డీఎస్పీ రవీందర్ రెడ్డి, ఎస్-న్యాబ్ ఇన్స్పెక్టర్ రమేష్, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ విజయ్ కృష్ణ, అమీన్పూర్ ఇన్స్పెక్టర్ నాగరాజు, నారాయణ్ ఖేడ్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, సీసీఎస్ ఎస్ఐ శ్రీకాంత్, మనూర్ ఎస్ఐ రాజశేఖర్, సీసీఎస్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## వార్షిక తనిఖీలలో భాగంగా మునిపల్లి పోలీసు స్టేషన్ తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్



**డైలీ రిపోర్ట్, సంగారెడ్డి అక్టోబర్ 17:** వార్షిక తనిఖీలో గురువారం నాడు సంగారెడ్డి జిల్లా, మునిపల్లి పోలీసు స్టేషన్ను తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్ పోలీసుల గౌరవ వందనం స్వీకరించి, పోలీసు స్టేషన్ ఆవరణలో మొక్కను నాటారు. అనంతరం పోలీసు స్టేషన్ ఆవరణ, సిబ్బంది ఉండే బ్యారెక్ పరిశుభ్రత, పోలీసు స్టేషన్ రికార్డులను తనిఖీ చేశారు. అండర్ ఇన్వెస్టిగేషన్ లో ఉన్న కేసులను చెక్ చేస్తూ.., తగు సలహాలు సూచనలు చేశారు. స్టేషన్ పరిధిలో ఉన్న కేడి, సస్పెక్ట్, లను తరుచూ చెక్ చేస్తూ, ఆన్లైన్ రికార్డు లలో అప్డేట్ చేయాలని సూచించారు. యన్.బి.డబ్ల్యూ ఎగ్జిక్యూషన్ లో ఎలాంటి అలసత్వం చూపరాదని, అండర్ ఇన్వెస్టిగేషన్ లో ఉన్న కేసుల చేదనకు ప్రత్యేక ప్లాన్ ఆఫ్ యాక్షన్ ఉండాలని, నాణ్యమైన ఇన్వెస్టిగేషన్ త్వరితగతిన పూర్తి చేసి, బాధితులకు అండగా ఉండాలని సూచించారు. జిల్లాలో నిషేదిత గంజాయి, గుట్కా, పాన్ మసాలా, సిగరెట్ అమ్మకాలు, అక్రమ రవాణాకు తావు లేకుండా తరుచూ వెహికల్ చెక్కింగ్స్ నిర్వహించాలని, హైవే లపై హై-రెసల్యూషన్ సిసి కెమెరాలను ఏర్పాటు చేయించాలని, సిసి కెమెరాల ప్రాధాన్యతను ప్రజలకు వివరిస్తూ, గ్రామాలలో, పలు ప్రధాన కూడళ్లలో సిసి కెమెరాలను ఏర్పాటు చేసుకునే విధంగా అవగాహన కల్పించాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు బ్లాక్ స్పాట్ లను గుర్తించి, సైన్ బోర్డ్లను ఏర్పాటు చేయాలని, హైవే రోడ్లకు కలుపుతూ ఉండే రోడ్లకు క్లియర్ వ్యూ ఉండేవిధంగా చూడాలన్నారు. శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా విజిబుల్ పోలిసింగ్ నిర్వహిస్తూ, మన చుట్టూ జరుగుతున్న వివిధ రకాల ఆన్లైన్ మోసాలు, భూ సంభందిత చీటింగ్స్ మరియు నూతన చట్టాల గురించి ప్రజలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎ.సంజీవ రావ్, సంగారెడ్డి డియస్పి సత్యయ్య గౌడ్, కొండాపూర్ ఇన్స్పెక్టర్స్ చంద్రయ్య మరియు మునిపల్లి ఎస్ఐ, సిబ్బంది ఉన్నారు.

# ప్రకృతి తో స్నేహం చేసి జీవవైవిధ్యాన్ని కాపాడుదాం...

**ప్రకృతి ప్రేమికుడు జక్కుల వెంకటేష్**





**అదిలాబాద్ జిల్లా డైలీ రిపోర్ట్ బ్యూరో:** చిన్న చిన్న సామాన్య సంఘటన లు సైతం మనిషి జీవితాన్ని ప్రభావితం చేసి ఘననీయమైన మార్పు తీసుకొస్తాయన డా నికి.. ఉదాహారణ జక్కుల వెంకటేష్ జీవితం.అయన ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండల కేంద్రనికి చెందిన వ్యక్తి. సీదా సాధ జీవితం, కుటుంబ పోషనార్థం చిరు వ్యాపారం. రెక్కాడితే కానీ డొక్కాడని పరిస్థితి. కానీ ప్రజాపక్షం లో ఉంటూ...స్థానిక రాజకీయాలను ప్రభావితం చేస్తూ...అధ్యాత్మిక కార్యక్రమాలతో సమాజాన్ని మంచి త్రోవ లో ముందుకు తీసుకెతున్న ఒక సామాన్య వ్యక్తి కథనం.జక్కుల వెంకటేష్ జీవనం నల్లేరు పై నడక ఏం కాదు. బ్రతుకు దేరువుకై ఎక్కడెక్కడో తిరోగోచ్చి 11 సంవత్సరాల క్రితం భార్య పిల్లల తో బోథ్ కు వచ్చి తన వద్ద ఉన్నా 400 వందల రూపాయల పెట్టుబడి తో చిన్నగా కూరగాయల వ్యాపారం ప్రారంభించి ఇప్పుడు సంతోషంగా పూజ సామాగ్రీ షాప్ నడిపిస్తూ సంతోషంగా ఉన్నాడు.వివరాల్లోకి వెళ్తే 4 సంవత్సరం ల క్రితం జరిగిన ఒక సంఘటన ఆయనను పక్షి ప్రేమికుడిగా మార్చింది. అది ఎలాగంటే వేసవి కాలం లో తన షాప్ లో ఉన్నప్పుడు తన షాప్ ముందర ఒక పిచ్చుక గిల గిల కొట్టుకుంటూ కనిపించింది. ఆ పిచ్చుకకు వాళ్ళ పాప నీళ్లు తాపుదాం అని ప్రయత్నించే లోపు ఆ పిచ్చుక చనిపోవడం పాప ముఖం లో భాధను చూసి పక్షుల కు ఏదైనా చేయాలి అని సంకల్పించడం జరిగింది. పక్షులకోసం ఏమైనా చేయాలి అనే ఆలోచన తో పాటు ఎలా చేయాలి ఏం చేయాలి అనే ప్రణాళిక చేయనారంభించారు. బోథ్ లోని ఎంపీడీఓ ఆఫీస్, పోలీస్ స్టేషన్ ల వద్దా చెట్లు ఎక్కువ ఉండటం వలన నీటి తోట్టెలను ఏర్పాటు చేయడం జరిగినది. ఇట్టి విషయాన్ని సోషల్ మీడియా ద్వారా తెలుకున్న గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ స్వర్ణ లత మరుసటి రోజు పిలిపించి పిల్లల అందరికి పక్షుల పై అవగాహనా కల్పించి పాఠశాల లో నీటి తోట్టెలు ఏర్పాటు చేయించడం జరిగింది. ఇలా పక్షుల సంరక్షణ గూర్చి మెసేజ్ ఎక్కువ మందికి చేరాలి అనే ఉద్దేశం తో...వివిధ ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, దేవాళయాలు, పాఠశాల లు, అధికారులు, రాజకీయ, ఆధ్యాత్మిక, సామాజిక ప్రముఖులను కలుస్తూ నీటి తోట్టెలు, బర్డ్ ఫీడర్ లు బహుమాణంగా ఇస్తూ... వారి చేతుల మీదుగా ఏర్పాటు చేసి, మీడియా, సోషల్ మీడియా ద్వారా ప్రచారం చేయడం జరుగుతుంది.ఇలా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎన్నో పాఠశాల లో తిరుగుతూ పక్షులు, మూగజీవాలకు నీరు, ఆహరం, గూడు ఏర్పాటు చేయాలి అని, ప్రకృతి సేవా చేయాలి అని చెప్పడం జరుగుతుంది. పిల్లలచే నీటి తోట్టెలు, బర్డ్ ఫీడర్ లు, పక్షి గూడులు తయారు చేయించి పెట్టడం జరుగుతుంది. ప్రకృతి ని కాపాడతాం అని ప్రతిజ్ఞ చేయించడం జరుగుతుంది. పిల్లలకు... పక్షుల ఆవశ్యకత, పక్షుల వల్ల లాభలు,అవి అంతరించిపోవడానికి కారణాలు, వాటి సంరక్షణ చర్యలు,మనిషిగా మన బాధ్యత లు, ప్రకృతి రక్షణ, గాలి, నీరు, మృత్తిక, ధ్వని కాలుష్యాలు,ప్లాస్టిక్ నిర్మూలన, ప్రకృతి ఇచ్చిన వనరులను కాపాడుకోవడం, మొక్కలు నాటడం కాపాడుకోవడం, గోవుల గూర్చి, ఇంకుడు గుంతలు, పుట్టిన రోజు, వివాహదీ శుభకార్యాలలో పక్షిగూడు, బర్డ్ ఫీడర్, మంచి పుస్తకాన్ని బహుమాణంగా ఇవ్వాలి అని అనే విషయాల పై అవగాహన కల్పించడం జరుగుతుంది.ఇట్టి విషయం ఒక సామాజిక ఉద్యమం లా మారి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జనాలు నీటి తోట్టెలు, బర్డ్ ఫీడర్ లు, పక్షి గూళ్లు ఏర్పాటు చేయడం జరుగుతుంది. తన స్వంత ఖర్చుల తో ఇంతటి బృహత్కార్యాన్ని చేపట్టిన జక్కుల వెంకటేష్ పలువురి ప్రశంసలు పొందుతున్నాడు.ఆయన తో మాట్లాడితే... మనిషి ప్రకృతి తో స్నేహం చేసినరోజు పూర్తి ఆరోగ్యం గా, ఆనందంగా ఉన్నాడు. ఎప్పుడైతే ప్రకృతి ని మరిచి కేవలం అభివృద్ధి పేరుతో శాస్త్ర సాంకేతికత పైనే ఆధారపడుతూ... ప్రకృతి ధ్వంసం చేస్తూ ఉంటున్నాడు కాబట్టి ఇంతటి ఆందోళనలో బ్రతుకుచున్నాడు. మనిషి మనుగడకు ప్రకృతి, పారిశ్రమీకరణ రెండు అవసరమే. కనీసం నా వల్ల ప్రకృతి లో కొన్ని జీవులు బ్రతికినా చాలు. నా జీవితం ధన్యం ఐనట్లే నా జన్మ సార్థకం ఐనట్లే అని అంటాడు. మన మానవ జీవనం మనుగడ ప్రకృతి తోనే ముడిపడి ఉంది అని అంటాడు.

Printed And Published By Bakka Ravinder,on Behalf of Daily Report Publications And broadcasting News, Sangareddy Municipality, Ganesh Nagar HNo 3-11/ Sangareddy District Telangana state , Editor. B. shirisha print code TELTEL.2019/082422 , Cell 8501919707